క్లుప్తంగా

వైద్య ఖర్చులకు స్నేహితుల సహాయం



చల్లపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఆదివారం స్థానిక ఇస్లాంనగర్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ డ్రైవర్ అబ్దుల్ జబ్బార్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఈ విషయాన్ని అతని పదో తరగతి బాల్య మిత్రులు తెలుసుకున్నారు. స్థానిక ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాలలో 1981–82 బ్యాచ్‌గా పదో తరగతి చదువుకున్న బాల్య స్నేహితులు అందరూ కలిసి రూ.60వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం చల్లపల్లిలో అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గువ్వా బత్తిన నాగేశ్వరరావు, మేకా శివ నాగేశ్వరరావు, రావి రవి, వక్కలగడ్డ శివ ప్రసాద్, కాకర్ల శ్రీను, మోతుకూరి ఏడుకొండలు, పాగోలు నాగ సీతారామారావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై పెరుగుతున్న ఆసక్తి



గూడూరు: గ్రంథాలయ సంస్థ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల వల్ల విద్యార్థుల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెరుగుతోందని గూడూరు శాఖా గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం గూడూరు గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. అనంతరం చిన్నారుల చేతి రాత మెరుగు పర్చడానికి కాపీ రైటింగ్ ప్రాక్టీస్ చేయించారు.

ఆటాపాట, శిక్షణ



ఘంటసాల: వేసవిలో విద్యార్థుల్లో విజ్ఞానం, వినోదం పెంపొందించడానికి కృష్ణాజిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు మండలంలో ఆట పాటలతో కొనసాగుతున్నాయి. ఘంటసాల గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.శరత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు, పుస్తక పఠనంతో పాటు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. కొడాలి గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కాపీ రైటింగ్, నీతి కథలు చదివించడంతో పాటు యోగ నేర్పించారు.

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం



అవనిగడ్డ: మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో జరిగిన సత్యసాయిబాబా మందిర వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యంతో పాటు సత్యసాయిబాబా భక్తులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

శ్రీనివాసరావుకు పరామర్శ

రావివారిపాలెం(మోపిదేవి): మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి మార్కెట్ కమిటీ విశ్రాంత ఉద్యోగి ప్రసాదరావు(76) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వారి ఇంటివద్ద మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తంచేశారు. మృతునికి భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు.

నేడు షిర్డీ సాయి నిజపాదుకలు రాక

బంటుమిల్లి: షిర్డీ సాయి నిజపాదుకలు సోమవారం స్థానిక శ్రీ షిర్డీ సాయి మందిరానికి వస్తున్నట్లు మందిర కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన జోస్యుల శ్రీనివాసరావు సారథ్యంలో సాయి పాదుకలు ఉదయం 10 గంటలకు సాయి మందిరానికి వస్తాయని వారు తెలిపారు. సాయి భక్తులు సమయానికి మందిరానికి వచ్చి సాయి నిజపాదులకు సందర్శించి పూజలు చేసుకోవాలని వారు కోరారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి

ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ



పెడన ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో పర్యటిస్తున్న ఎస్పీ అస్మీ

పెడన: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని అందరు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ అన్నారు. ఆదివారం సాయంత్రం పెడన పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ రోజున అందరు సహకరించడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని అందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. లెక్కింపు కూడా పూర్తి అయిన తర్వాత ఎటువంటి కవ్వింపులకు దిగకుండా ఉండాలని అందుకు అందరూ సహకరించాలని కోరారు. అందరు సహకరిస్తేనే ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందని ఆయన అన్నారు. లెక్కింపు అనంతరం ఎటువంటి ర్యాలీలు, విజయోత్సవ సభలు చేయరాదని ఎస్పీ తెలిపారు. క్రిటికల్ ప్రాంతాల్లో పికెటింగ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు ముఖ్యమైన నాయకుల ఇళ్ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. లెక్కింపు రోజున కృష్ణా యూనివర్సిటీ వద్ద సీఆర్పీఎఫ్ దళాలతోపాటు పోలీసులు అందరు కలిపి 600 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు డీఎస్పీ కె. రమేష్ బాబు, సీఐ నాగేంద్రప్రసాదు, ఎస్ఐ సూర్య శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు..

అవనిగడ్డ: ఎన్నికల ఫలితాలు సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ హెచ్చరించారు. అవనిగడ్డ వంతెన సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ ఆయన పాదయాత్రగా వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలను అడ్డుపెట్టుకుని ఎవరన్నా శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. క్రికెట్ ఇతర క్రీడల్లో గెలుపు ఓటములు ఎలా అయితే సమానంగా చూస్తామో ఎన్నికల ఫలితాలను అలాగే చూడాలన్నారు. రౌడీషీటర్లు, బైండవర్‌లో ఉన్న వారికి ఇప్పటికే కౌన్సెలింగ్ నిర్వహించామని ఇలాంటి వారిపై ఓ కన్నేసినట్టు చెప్పారు. ఎవరన్నా చట్టాన్ని అతిక్రమించి అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఫలితాల సందర్భంగా గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఉండేలా అందరూ సహకరించాలన్నారు. కేసుల్లో ఇరుక్కుని ఇబ్బందులు పాలుకావద్దని హితవు పలికారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రాల నుంచి కార్నియాలు సేకరణ



మృతురాలు జోయకుమారి (ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని 2వ వార్డులో ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలు ఉప్పల జోయకుమారి(65) నేత్రాలను విజయవాడ తాడిగడపలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. మృతురాలి కుమారుడు శ్రీనివాసరావు, సునీత దంపతులు, కుమార్తె తలశిల వెంకటలక్ష్మి, పూర్ణచంద్రరావు ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకొచ్చారు. దీంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణకు సమాచారం అందించగా వారి సహకారంతో ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం వచ్చి మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 205కు చేరాయని రఘుశేఖర్ చెప్పారు.

కిక్కిరిసిన సుబ్బారాయుడి సన్నిధి



మోపిదేవిలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణంలో ఎటు చూసినా భక్తజనంతో కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కూడా స్వామిని వారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

కోలాహలంగా జాతరోత్సవం



మొక్కులు తీర్చుకునేందుకు నైవేద్యాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

నాగాయలంక: భావదేవరపల్లిలో కొలువై ఉన్న గ్రామదేవత అంకాల దేవర అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం ఆదివారం కోలాహలంగా సాగింది. గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా తరలివచ్చి మెక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత జాతర సంప్రదాయ రీతిలో అమ్మవారి గుడి సంబరం ఆచారవంతులచే ఆరంభించారు. తదుపరి భక్తులు జట్లుగా, కుటుంబాలుగా కోళ్లు, గొర్రెపొట్టేళ్లతో ఊరేగింపుగా వచ్చి మొక్కుబడులు చెల్లించుకుని తదుపరి నైవేద్యాల సమర్పించుకున్నారు. అనంతరం అంకాల దేవర జాతర సంప్రదాయంలో భాగంగా పోతురాజుస్వామి, గ్రామదేవత ఉర్వేశమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు, గ్రామోత్సవం జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మారెడ్డి సత్యనారాయణ(సత్తిబాబు), నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు (చంటి) తదితరులు పాల్గొన్నారు.

చల్లబడ్డ వాతావరణం

మచిలీపట్నంటౌన్: నగరంలో ఆదివారం వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండి చల్లగాలులు వీచాయి. చిరుజల్లులు కురిశాయి. వాతావరణం చల్లబడటంతో అధిక ఎండలతో ఇబ్బందులు పడ్డ నగర ప్రజలు సేదతీరారు. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడ్డ ఉక్కపోత తగ్గకపోవటంతో కొంత ఇబ్బంది తప్పలేదు. ఆకాశం మేఘావృతమైన బయట ఉక్కపోత ఉండటంతో గృహాల్లో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు వినియోగించక తప్పలేదు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రావి దుర్గా సుధాకరరెడ్డి, సౌదామిని దంపతుల ఆర్థిక సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. మోపిదేవి పాత్రికేయులు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన హరిశ్రీ నృత్యప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇస్తున్న హరిశ్రీ

మచిలీపట్నంటౌన్: నగరానికి చెందిన పంచకర్ల హరిశ్రీ ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. పంచకర్ల హరిశ్రీ ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత డాక్టర్ చింతా రవిబాలకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం నేర్చుకుంది. ఈ నృత్య రంగ ప్రవేశ ప్రదర్శన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి స్థానిక పరాసుపేటలోని సువర్ణ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హరిశ్రీ ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శన అమితంగా ఆకట్టుకుంది. సీనియర్ కళాకారుల వలే ఆమె హావభావాలతో నృత్యాన్ని ప్రదర్శించడాన్ని పలువురు ప్రశంసించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు హాజరవగా.. హరిశ్రీ తల్లిదండ్రులు నగేష్, అనూరాధ పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల సమర్పణ

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.



వ్యవసాయ పనులు ప్రారంభం



దేవరకోట(ఘంటసాల): వాతావరణంలో వస్తున్న మార్పులతో ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నారు. ఆదివారం దేవరకోట గ్రామంలోని కొందరు రైతులు పొలాల్లో జీలుగ విత్తనాలను చల్లడం ప్రారంభించారు. మరి కొంతమంది వేసవి దుక్కులు, గట్లు వేయించడం చేస్తున్నారు. పొలాల్లోని కలుపు మొక్కలను తొలగిస్తూ పంట భూములను సాగుకు సన్నద్ధం చేస్తున్నారు. వరుణుడు సకాలంలో కరుణిస్తే ఈ ఏడాది మంచి పంటలు పండుతాయని ఎదురు చూస్తున్నట్లు రైతులు తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



నారికేడలపాలెంలో తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్ఐ నస్రీన్, వీఆర్వో కాకుకేశ్వరరరావు

గూడూరు: మండలంలో మట్టి అక్రమంగా తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు తహసీల్దార్ ఎస్.ఎస్.శాంతి స్పష్టం చేశారు. మండలంలోని కప్పలదొడ్డి, నారికేడాల పాలెం గ్రామాల్లో శనివారం రాత్రి కొంత మంది మట్టి అక్రమంగా తవ్వినట్లు గుర్తించి వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమ మట్టి తవ్వకాలు నిర్వహించవద్దని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. అంతే కాకుండా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వీఆర్వోలు, వీఆర్ఏలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి మట్టి అక్రమ తవ్వకాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామన్నారు. అయితే సెలవు రోజుల్లో గుట్టుచప్పుడు కాకుండా కొన్ని చోట్ల మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో సిబ్బందితో తనిఖీలు చేయించామన్నారు. నారికేడాలపాలెంలో కాల్వ గట్టును నరికి మట్టి తరలించుకుపోతున్నట్లు స్థానిక వీఆర్వో కె.కాకుకేశ్వరరావు, ఆర్ఐ నస్రీన్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించారన్నారు. కప్పలదొడ్డిలో మట్టి దిబ్బలను తవ్వి మట్టి తరలిస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో స్థానిక వీఆర్వో అడపా నరేష్‌తో కలిసి ఆర్ఐ విచారణ నిర్వహించారన్నారు. రెండు చోట్లా మట్టి తరలించినట్లు నిర్ధారణ కావడంతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

కనుల పండువలా పుష్పయాగం



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



పెదప్రోలు గ్రామంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఉత్సవమూర్తులకు పుష్పయాగం చేస్తున్న పండితులు

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో వేంచేసి ఉన్న సువర్చల ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పుష్పయాగం కనుల పండువలా జరిగింది. పండితులు డీవీ మేఘనరసింహకుమార్, రొంపిచర్ల హనుమంతాచార్యులు శిష్య బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య ప్రధాన మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పలు రకాల పుష్పాలతో శనివారం అర్ధ రాత్రి వరకు నిర్వహించారు. వందలాది మంది భక్తులు భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్, చాలీసా పారాయణ చేస్తూ యాగం పూర్తి అయ్యేంత వరకు పాల్గొన్నారు. అనంతరం దాదాపు 46 రోజులుగా హనుమాన్ చాలీసా పారాయణ చేసిన భక్తులు పండితులు నరసింహకుమార్, హనుమంతాచార్యులను ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాఘవయ్య, సత్యనారాయణ, రమేష్, కామరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు

కృత్తివెన్ను: హనుమజ్జయంతి ఉత్సవాలు మండల వ్యాప్తంగా రెండో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలు సందర్భంగా గాంధీనగరం గ్రామంలోని అభయ ఆంజనేయస్వామివారి దేవాలయంలో ఆదివారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తమలపాకులార్చన, సింధూరార్చనలు జరిగాయి. మరో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుంటున్నారు. నీలిపూడి, సీతనపల్లి, ఒంటిళ్లు గ్రామాలలోనూ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

భక్తులకు అన్న సమారాధన

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న మదరామ హనుమాన్ ఆంజనేయ స్వామివారి ఆలయంలో ఉదయం ఆలయ ప్రధానార్చకులు పెళ్లూరి వెంకటేశ్వరావు బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని తొలుత విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రాముల వారి అష్టోత్తరం ఆంజనేయస్వామివారికి ఏకాదశ మన్యసూక్త అభిషేకం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక వాహనంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా స్వామివార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ప్రజలకు సంక్షేమం అందించే ప్రభుత్వం రావాలి



మాట్లాడుతున్న సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ రాజు

పామర్రు: రాష్ట్రంలోని ప్రజలకు సంక్షేమం అందించే ప్రభుత్వం రావాలని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల అన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించే ప్రభుత్వాన్ని భగవంతుడు మనకు ప్రసాదించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వమే రేపు గెలవబోతోందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు టి. షాలేంరాజు, ఎం. చంటిబాబు, శామ్యూల్, బీవీ సాగర్, ఆదాము, బి.సాల్మన్‌రాజు, ఆర్. సాల్మన్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



అభయాంజనేయ స్వామి కల్యాణం

గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్ సెంటర్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి అభిషేకాలు, సాయంత్రం స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన ఈ కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాలు సోమవారం కూడా కొనసాగుతాయని భక్తులు పాల్గొని మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గం గౌరవాధ్యక్షుడు బొగ్గారపు తిరుపతయ్య, అధ్యక్షుడు పోకూరి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు శేగు వెంకట రామారావు, శేగు దిలీప్‌కుమార్, కార్యదర్శి తిరివీధి శ్రీరాములు, కోశాధికారి పి.వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి దేవస్థానంలో..

గుడివాడ టౌన్: స్థానిక పెద్దవీధిలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణం అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఎం. శ్రీకృష్ణకుమార్ శర్మ, ఎ.సమీర్‌కుమార్ శర్మ, జె.బాలకృష్ణ శర్మ, సత్య వరప్రసాద్, బి.శేషాచలశర్మ, ఆలయ నిర్వాహకులు పి.పద్మావతి, జి. ప్రియ అనురాధ, జి. సత్యనారాయణ, ఆర్. శ్రీకాంత్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యయోగం



మచిలీపట్నం టౌన్: ప్రస్తుత హడావుడి జీవనంలో ప్రతి ఒక్కరూ యోగా చేయటం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని నగర పాలకసంస్థ కమిషనర్ సీహెచ్ వీవీఎస్ బాపిరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగ సభ ఆధ్వర్యంలో స్థానిక చింతగుంటపాలెం దివ్య యోగ మందిర్ యోగా సాధకులు నగరంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కమిషనర్ బాపిరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేసేందుకు సమయం కేటాయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ సతీష్ కుమార్, యోగ గురువులు, యోగ సాధకులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే ఆత్మ సంతృప్తి

పామర్రు: ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తే ప్రజలు, తోటి ఉద్యోగుల మన్ననలతో పాటు ఆత్మ సంతృప్తి కలుగుతుందని పామర్రు మానవతా రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. పామర్రు మానవత జీవిత కాల సభ్యులు అల్లాడ సోమశేఖర్‌రావు ఆర్టీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం సత్కార సభను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశేఖర్‌రావు చేసిన సేవలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం సోమశేఖర్, సీత దంపతులను మానవతా ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో మానవతా కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, కన్వీనర్ త్రివిక్రమరావు, తిరుమలశెట్టి శ్రీనివాస్, డైరెక్టర్లు రామారావు, తుంగల వేణు, కొల్లా శ్రీనివాసరావు, మండపాక సుబ్బారావు పాల్గొన్నారు.